న్యూజెర్సీ కథల పోటీలో రూ. 1,000/–ల బహుమతి పొందిన కథ

# మార్కెట్లో మనిషి

**పల్లేటి బాలాజీ**

రకరకాల పండ్లతో ఉదయాన్నే ఎంతో కళకళ లాడుతోంది పళ్ళ మార్కెట్.

"కమలా పొళ్ళు... కమలా పొళ్ళు... నాగపూర్ కవలాలు... నాగపూర్ కవలాలు.. రండి సార్... రండి... కొనండి..."

"యాపిలాపిల్... సిమ్లాయాపిల్.. బలే రుచి... రండి సార్ రండి..."

"నారింజల్... వడ్లవూడి నారింజలు... రుచిచూస్తే వదలరు... రండి... రండి...రండి... సార్..."

రకరకాల పళ్ళు. వివిధ రకాల మనుషులు. పలురకాల అరుపులు.

అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన పళ్ళన్నింటినీ ఒకేచోట చూస్తుంటే... భారత దేశానికి ప్రతీకలా అన్పిస్తోంది పళ్ళ మార్కెట్!

"డజను పన్నెండు... డజను పన్నెండు... మాంచి చుక్కరిటి డజను పన్నెండే... రండిసార్ రండి!"

అరటి పండ్ల బండివాడి కేకలతో కూడిన పిలువు.

"సార్ ఆర్రూపాయల్... ఆర్రూపాయల్... చుక్కరిటి... అర్డజను ఆర్రూపాయలే!"

ఇంకోడి తెలివైన కేకతో పిలువు

"సార్... రండి... రండి... మాంచి చుక్కరిటి... రూపాయి రూపాయి... పొండు రూపాయ్"

మరీ అతి తెలివితో పిలువు.

పేదవాడి ఆపిల్‌పండుగా జగత్ప్రసిద్ధి గాంచిన అరటి పండు ఒకటి రూపాయి!

పండ్ల ధరలు భగ్గున మం[illegible]న్నాయనడానికి సజీవ నిదర్శనం!!

చెప్పిన ధరకు కొనకుండా బేరం చెయ్యడమన్నది మానవ నైజం, కనుక బేరం మొదలు పెడదామనుకున్నాను. ఒకడు డజను పన్నెండు... ఇంకోడు అరడజను ఆరు... మరొకడేమో పండు రూపాయి. వెరసి ముగ్గురిదీ ఒకే రేటు! ఎవరితో బేరం చెయ్యాలి?

అతి తెలివితోనే బేరం చేద్దామనుకుని...

"డజను పది రూపాయిలకిస్తావా?" అనడిగాను.

"గిట్టుబాటు కాద్సార్!"

"పోనీ... రెండు డజన్లు కొంటాను. ఇరవైకివ్వలేవా?"

ఏం సమాధానం చెప్పకుండా మొహం అదోలా పెట్టాడు.

అతి తెలివిగానే అడిగానన్పించింది.

"చెప్పు. ఇరవైనాలుగు పళ్ళు... ఇరవై రూపాయిలకివ్వలేవా?"

"గిట్టుబాటు కాద్సార్!"

"మరీ అట్లా ఒకే మాటయితే ఎలా చెప్పు?... ఆశకైనా అంతుండాలి. నువ్వోరేటు చెప్తావు,నేనో రేటు చెప్తాను. మధ్యస్తంగా ఓ రేటు కుదుర్చుకోవాలి"

"గిట్టుబాటయితే ఇవ్వనా సార్..."

"ఇదిగో... నాలుగడుగులేస్తే హోల్‌సేల్ మార్కెట్... అక్కడకు గనక వెళ్ళానంటే నేనడిగిన రేటుకంటే తక్కువకే తెచ్చుకోగలను. కానీ ఏదో బద్ధకించి నీ దగ్గర కొచ్చాను"

"మాకూ వాళ్ళకీ పోలికేముంది సార్... వాళ్ళు వేల మీద యాపారం జేస్తారు. మేం పొద్దన రెండొందలు దెచ్చుకున్నామా... సాయంత్రానికి రెండొందలిరవై గట్టాలి. మీరిచ్చే పావలా పదిపైసలు సేటుకిచ్చేస్తే మేం ఏం దినాలి సార్... మా సంగతి గూడా ఆలోచించండి."

"ఏమ్ పోవయ్యా... మరీ చెప్పొచ్చావ్... పొద్దున రెండొందలు తెచ్చుకొని సాయంత్రానికి రెండొందలిరవై కడ్తావా? ఇదెక్కడి రేటు? అబద్ధం ఆడినా అతికినట్టుండాలి."

"అబద్ధం గాద్సార్... నిజం! ఈ మార్కెట్‌లో ఎవడ్నడిగినా చెప్తాడు"

ఇతను డజను పన్నెండుకమ్మడానికిలా అబద్ధం చెప్తున్నాడా?

కానీ ఇతని మొహం చూస్తే అబద్ధం చెప్తున్నట్టు లేదు. దీని గురించి కనుక్కోవాలి.

"ఒకవేళ నువ్వు సేటు దగ్గర తీసుకున్న రెండొందల్తో కొన్న పళ్ళు అమ్మలేకపోతే?"

"ఈ దినం అమ్మకాల్లేవు సేటో రేపిచ్చేస్తాను అన్జెప్పి మర్నాటికి ఎంతకయినా ఎట్టయినా వున్న పళ్ళు తెగనమ్మి రెండొందలిరవైకి ఇంకో ఇరవై గలిపి సేటుకిచ్చెయ్యాల్సిందే?!"



"ఇవ్వలేకపోతే?"

"అమ్మో ఇంకేవన్నా వుండాదా... నా చెమ్డాలూడ్దీస్తాడు సేటు. అందుకనే ఈలైనంత వరకూ ఏ రోజు కారోజు సాయంకాలానికే సేటుకి డబ్బులిచ్చేసి మరుసట్రోజు పొద్దున్నే మళ్ళీ సేటు కాడ డబ్బుల్దీసుకుంటుంటా..."

"అంత ఎక్కువ వడ్డీకి ఆ సేటు దగ్గర డబ్బు తీసుకోకపోతే యేం?"

"ఆ సేటు దగ్గర దీసుకోకపోతే నా మొహం జూసి నాకు డబ్బు లిచ్చే వోడెవుడ్సార్... ఆ సేటు దేవుడు గాబట్టి ఇస్తన్నాడు. లేదంటే నేను అడక్కుదినాల్సిందే!"

గొర్రె కసాయివాడ్నే నమ్ముతుందనడానికి ప్రత్యక్ష నిదర్శనంలా వున్న అతని పరిస్థితి నన్నెంతో కదిలించి వేసింది. నాలోని బేరంచేసే నైజాన్ని పక్కనపెట్టి

"చూడూ... నాక్కావల్సిన రెండు డజన్లు నువ్వు చెప్పిన రేటుకే ఇవ్వు." అంటూ వాడి చేతిలో ఓ ఇరవై నోటు ఓ ఐదునోటు పెట్టాను.

రెండుడజన్ల పళ్ళతో ఓ రూపాయి బిళ్ళ తిరిగిచ్చాడు.

రకరకాల పళ్ళు. వివిధ రకాల మనుషులు. పలు రకాల అరువులు.

వాళ్ళ ఆరువుల వెనకాల స్పష్టమైన జీవన పోరాటం కన్పిస్తోంది.

మార్కెట్‌లోని పళ్ళన్నీ కళావిహీనంగా కన్పిస్తున్నాయి.

మనుషుల మధ్య మానవ సంబంధాలు మాయమై వ్యాపార సంబంధాలు నెలకొన్న నేటి సమాజంలో పాపం ఈ పండ్ల బండివాడి జీవితం భారం చలేసంత కష్టంగా తయారైంది. అందువల్లే వందకు పన్నెండు గంటల వ్యవధికి పది రూపాయిల వడ్డీ చెల్లించే పరిస్థితి ఏర్పడింది. మనిషి ప్రవర్తనలో సున్నితత్వం, సహజమైన మానవత్వం నశించి జడత్వం, కాఠిన్యం చోటు చేసుకోబట్టే సేటు అనబడే 'మనీ'షి ఇలాంటి అమాయకుల దగ్గర పొద్దున్నే రెండొందలిచ్చి సాయంత్రానికి రెండొందలిరవైగా గుంజుకో గలుగుతున్నాడు.

అయినా ఇతననేదీ నిజమేలాగుంది. సేటు తప్పితే ఇతనికి డబ్బిచ్చేవాడె వడు?నేనే ఎందుకివ్వకూడదు?

"మన చుట్టూ చీకటిగా వుంది కదా అని అందర్లా మనం కూడా కళ్ళు మూసుకుంటే కటిక చీకటే మిగులుతుంది. కానీ ఏ ఒక్కరు చిరుదీపం వెలిగించినా చాలు కొంత మేరకు చీకటి పారద్రోలడానికి. ఆ తరువాత ఆ దీపవు వెలుగుతో మరికొన్ని దీపాలు వెలుగుతాయి" చిన్నప్పుడు చదివిన మాటలు గుర్తొచ్చాయి.

సేటు తప్ప ఎవడూ లేడని ఎందుకనుకోవాలి? ఈ బండివాడికివ్వాడు నేనే ఓ రెండొందలిస్తాను. ఓ రెండొందలంటే నాకు చాలా చిన్న మొత్తం. నేనిచ్చే రెండొందల్తో గనుక వీడు వ్యాపారం చేసుకుంటే పది రోజుల వడ్డీ మిగుల్చుకున్నా పదకొండో రోజుకి తనే పెట్టుబడి పెట్టుకునే స్థితికి వస్తాడు.

"సార్... నా కొనుగోలే పదకొండు. అందుకనే డజను పన్నెండు కమ్ము తున్నాను"

ఆలోచనా స్రవంతికి అడ్డుతగిలి చెప్పాడు బండివాడు.

"నువ్వు డజను పన్నెండు కమ్మినందుకు నేనేమీ అనుకోవడం లేదు కానీ... నీ పేరేంటి?"

"సోమయ్య సార్!"

"చూడు సోమయ్యా! నువ్వు సేటుకి రెండొందలకి సాయంత్రానికి ఇరవై రూపాయిల వడ్డీ కట్టడం నాకెందుకో నచ్చడం లేదు. ఒక్కపూటకి రెండొందలకి ఇరవై అంటే నెలకెంతో ఆలోచించు. అందుకని నేనే నీకో రెండొందలిస్తాను. ఊరికే కాదులే బ్యాంకు వడ్డీతో తిరిగివ్వు. అంటే నెలకు వందకు ఒక్క రూపాయి వడ్డీ..."

నా వైపు అదోలా చూశాడు. ఆ చూపులో నిజంగా వందకు నెలకు ఒక్క రూపాయి వడ్డీకి డబ్బిచ్చే వాళ్ళు కూడా ఈ లోకంలో వుంటారా? అన్న ప్రశ్న స్పష్టంగా కన్పిస్తోంది.

వాడి ప్రపంచంలో పూటకు వందకు పది రూపాయిల వడ్డీకి దొరకడమే మహాగగనం. జేబులోంచి రెండు వందనోట్లు తీసి "ఇదిగో రెండొందలు తీసుకో" అని వాడి చేతికిచ్చి "సరిగ్గా నెల తరువాత వస్తాను. రెండు రూపాయిలు వడ్డీ కలిపి తిరిగివ్వు చాలు."

* * * *

సోమయ్య సేటుకి ప్రతిరోజూ వడ్డీ చెల్లించే అవసరం లేదు కనుక.. ఈ నెల రోజుల్లో దాదాపు ఆరొందలు వడ్డీ రూపంలో చెల్లించాల్సిన డబ్బే మిగిల్చి వుంటాడు.

దోచుకోబడే సాటి మనిషి మీద మానవత్వం, దయ, జాలి వున్న వాళ్ళు ఇలాంటి వాళ్ళకు సహాయంచేస్తే? ఊరికే ఏం చెయ్యనవసరం లేదు. ఏ బ్యాంకులోనో పోస్టాఫీసులోనో పొదుపు చేసుకునే దాన్ని అదే వడ్డీకి ఇలాంటి వాళ్ళకిస్తే... వాళ్ళూ బాగుపడ్తారు. వాళ్ళతో సమాజమూ బాగుపడుతుంది. మనం ఆశించే న్యాయమైన వడ్డీ మనకు వస్తుంది.

ఏదో మంచి పని చేశావన్న తృప్తితో మార్కెట్‌లోకి అడుగుపెట్టాను.

"కమలాల్... కమలాల్.. నాగపూర్ కమలాల్" రెండు చేతుల్లో పండ్లు వుంచుకుని ఊపుతూ అరుస్తున్నాడు సోమయ్య. వాడి అరుపులో జీవన పోరాటం!

"నమస్కారం సార్!" బండి దగ్గర కెళ్ళిన నన్ను చూసి అరుపులాపి అదోలా చూడసాగాడు.

"ఏం సోమయ్యా బాగున్నావా? వ్యాపారం బాగా సాగుతోందా?"

"ఏదో అట్టా జరుగుతోంది సార్... సేటుకి నిన్నటి వొడ్డీ బాకీ పడ్డాను. ఈ రోజు గనక తీర్చకబోతే నా తాట దీస్తాడు. అందుకనే తొందర్తొందరగా పొళ్ళన్నీ అమ్మెయ్యాలని జూస్తుండాను"

"సేటుకి వడ్డీ బాకీయా...? అసలు నీకు మళ్ళీ సేటు దగ్గర డబ్బు


ఛలోక్తి

ఓసారి ఓ హరికథ భాగవతార్ విశ్వనాథ వారి దగ్గరకు వచ్చి "అయ్యా! మీ ఊళ్ళో హరికథ చెప్తానండీ" అన్నాట్ట.

"మీ ఊళ్ళో చెప్తారా" అని అడిగారట విశ్వనాథ.

"లేదండి" ఆయన సమాధానం.


"ఏం?" విశ్వనాథ ప్రశ్న.




"మా వాళ్ళు చెప్పించుకోరండి" అన్నాట్ట ఆయన.

"మరి మా వాళ్ళు చెప్పచ్చుకుంటారే" విశ్వనాథ పరిహాసం.

సేకరణ: ఆర్.విజయలక్ష్మి



తీసుకోవలసిన అవసరమేమొచ్చింది?"

"సార్ తవురేమో పెద్దమనుసుతో రెండొందలిచ్చినారా... దాంతో మర్నాడే అరిటిపొళ్ళుగొని సాయంత్రానికి అమ్మేసినాను. సేటుకి గట్టాల్సిన పన్నేడు కాబట్టి సంతోషంగా ఇంటికెళ్తే ఇంటికాడ చంటిదానికి ఒకటే జొరం. దాన్ని డాకటేరు కాడకి తీసకపోతే వంద రూపాయిల మొందులు రాసి ఇరవై రూపాయిలు ఫీజు దీసుకున్నాడాయన. నా కర్మ అట్టావుండాది మీరేం చేస్తారు సార్? మీ రెండొందలు తొందర్లోనే ఇచ్చేస్తాను సార్"

అతణ్ణి చూస్తే జాలేసింది. అతను సేటు దగ్గరకు తప్పనిసరిగా ఎందుకెళ్ళాడో అర్థమయింది. దాంతో నా పట్టుదల మరింత పెరిగింది.

"సరే... ఈ రోజు అమ్మిన దాంతో సేటు బాకీ పూర్తిగా తీర్చేయ్. నేను నీకు మరో రెండొందలిస్తా. దాన్ని రేవుపెట్టుబడిగా పెట్టుకో"

నేనిచ్చిన వంద నోట్ల వంకా నా వంకా మార్చి మార్చి చూశాడు.

"ఏం చాలదా?" అన్నాను. అతడికి పూర్తి సాయం చేయాలన్నదే నా తపన.

"సరిపోతుంది సార్!" అతడి కళ్ళలోని భావాన్ని నేను కృతజ్ఞతగా అర్థం చేసుకున్నాను.

* * * *

మధ్యలో నా ప్రయోగం ఎలా వుందో చూడాలని అనిపించినా నెల రోజులూ ఆగాను. మధ్యలో వెళ్తే అతడి నిజాయితీని శంకించి నట్లుంటుంది. అందుకే నెలరోజుల తరువాతే మార్కెట్‌లోకి అడుగుపెట్టాను.

సోమయ్యకోసం చూశాను. ఎక్కడా కనిపించలేదు.

ఈ నెల రోజులల్లో సోమయ్య పండ్ల వ్యాపారంలో బాగా సంపాదించేసి ఏదన్నా పెద్ద వ్యాపారం ప్రారంభించాడా? నా ఆలోచనలు ఆశల వైపు పరుగులు తీస్తుంటే కాళ్ళు మాత్రం మెల్లగా ఓ పండ్ల బండి వైపు కదలసాగాయి.

"బత్తాయిలు... బత్తాయిలు డజిను పాతిక. డజిను పాతికే! బత్తాయిలు కావాలా సార్?"

"ఇక్కడ మీతోపాటు పళ్ళమ్మే సోమయ్య ఎక్కడ?"

"వాడి కోసరమా మీరొచ్చింది. వాడు మార్కెట్ కొచ్చి పద్దినాలుపైనే అయ్యింది"

"ఏం ఏదన్నా వేరే వ్యాపారం మొదలుపెట్టాడా?"

"యేరే యాపారమా? ఈ యాపారాన్నే నక్రమంగాజెయ్‌లేని యెదవ యేరే యాపారం ఎట్టజేస్తాడు?"

"మరైతే మార్కెట్ కెందుకు రావడం లేదు?"

"రెండ్నెల్ల కిందనుకుంటా తవురొకసారి సొమ్మిచ్చెల్నారు. ఆ సొమ్మంతా కల్లుకి దారబోసేసినాడు"

"చంటిదానికి ఒంట్లో బాగాలేకుండా వొచ్చింది కదా?"

"సంటిదా?! సోమిగాడికసలు పెళ్ళామే లేదు. ఇంక సంటదేడుంటాది సారో. మీకట్ట అబద్దాలెజ్జెప్తంటాడు"

నాకేం మాట్లాడాలో తోచలేదు.

"ఆడబద్దాలు మీర్నమ్మేసి మల్లింకో పాలొచ్చి సొమ్మిచ్చినారా. అదేమయిందో... అంతేకాదు. ఈ మద్దె సేటుగ్గూడా సొమ్ము సరిగ్గా గట్టకపొయ్యేకాడకి సేటు వోడింటికి బొయ్యి వున్న బొచ్చెలు గిన్నిలు లాక్కొని, మక్కిలిరగదన్ని వోడికి సొమ్ములీడం మొగిచ్చేసినాడు. అంతే అప్పట్నుంచి మార్కెట్‌కి రావడంలా!"

ఊహించని విధంగా వినేసరికి నా మనసంతా ఏదో తెలియని బాధ ఆక్రమించింది.

"నువ్వు చెప్పిందంతా నిజమేనా?" అబద్ధం కావాలన్న ఆశతో మరోసారి అడిగాను.

"మీకు నా మాటలమీద నమ్మకం లేకబోతే... అదుగో మాకందరికీ సొమ్ములిచ్చే ఆ సేటు నడగండి' ' సేటు వైపు చూపించాడు. సేటు దగ్గరకెళ్ళి –

"మీరు సోమయ్య ఇంటికెళ్ళి బాకీ ఇవ్వలేదని గిన్నెలు, చెంబులు ఎత్తుకొచ్చేసారా?" అనడిగాను.

"ఇంతకీ మీరెవరు?! ఓహో మీరేకదూ సోమిగాడికి పెట్టుబడిచ్చింది. వాడదంతా కల్లుకే పెట్టుబడి పెట్టాడు" అని పెద్ద పెట్టున నవ్వి

"చూడూ...! ఇట్టాంటోళ్ళకి అప్పిచ్చి తిరిగి వొసూలు జెయ్యడం ఎంత కష్టమో మీకిప్పుడు దెలిసి వుంటాది. నేను వాళ్ళ ఇళ్ళ మీద పడ్తాననే బయంవల్లే నా బాకీలు కరుగ్గా దీర్చేస్తారు. మీకెందుకు సార్ ఇవన్నీ... అయినా వీళ్ళు బాగుంటే నాకెందుకు జెప్పండి ఈ రౌడీతనం?"

సేటు చెప్పింది నిజమైనా నాకెందుకో చాలా తేడా కన్పించింది. ఆలోచించాను.

"నేను సోమయ్య దగ్గర అప్పు వసూలు చేసుకోవడానికి మార్కెట్‌కి రాలేదు. వాడి జీవితంలో మార్పు చూసి ఆనందిద్దామని వచ్చాను. నేను డబ్బుతో వ్యాపారంచేసి డబ్బు సంపాదించాలనుకుంటే ఇలా వడ్డీకే ఇవ్వక్కర్లేదు. కానీ నేనాశించింది మనుషుల జీవితాల్లో మార్పుకోసం. తరువాత సమాజంలో మార్పుకోసరి

సేటు నావంక అదోలా చూడసాగాడు. నా మాటల్లో ఒక్క ముక్క కూడా సేటుకి అర్థమయ్యి వుండదు. నేను మౌనంగా మార్కెట్‌లోంచి వెనుదిరిగాను.

నా కళ్ళు సోమయ్యకోసం వెతకసాగాయి. జేబులో సోమయ్యకోసం ఇంకో రెండు వంద నోట్లు సిద్ధంగా వున్నాయి. సోమయ్య మారతాడన్న నమ్మకం నాకింకా వుంది. సోమయ్య నన్నింకోసారి మోసంచేసి ఇంకో రెండువంద నోట్లు పోగొట్టుకున్నా... అతడు మారతాడన్న నమ్మకాన్ని మాత్రం నేను పోగొట్టుకోను.




## అర్థం

మంత్రిగారి వద్దకు జనం వచ్చారు. వారందరిని మంత్రిగారి ఎదుట కూర్చోబెట్టి "మీరు ఎం.ఎల్.ఎ.గా ఎన్నికయిన నియోజకవర్గ ప్రజలు సార్. తమ కోర్కెలను మీకు చెప్పాలని వచ్చారట" చెప్పాడు మంత్రితో పి.ఎ.

దానికా మంత్రి 'ఏమిటయ్యా నాకు అర్థంకాని కొత్తపదాలు చెబుతున్నావే... ఎం.ఎల్.ఎ. అంటే ఏమిటి, నియోజకవర్గమంటే ఏమిటి ముందు చెప్పవయ్యా" — కె.వి.మధుసూదనరావు

